# సబితమ్మకే మా ఓటు

## మహేశ్వరంలో 51 కాలనీల అసోసియేషన్ల తీర్మానం

బడంగ్‌పేట, అక్టోబర్ 14 : మహేశ్వరంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తామని కాలనీ అసోసియేషన్ నాయకులు శపథం చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 51 కాలనీల అసోసియేషన్ నాయకులు బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానాలు చేసి విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి అందజేశారు. సబితా ఇంద్రారెడ్డికి పూర్తిగా అండగా ఉంటామని ప్రమాణాలు చేశారు. గతంలో మురికి కూపాలుగా మారిన చెరువులను సుందరీకరించి ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సంపూర్ణ సహకారంతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు కాలనీవాసులు పేర్కొంటున్నారు. కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు, వాకింగ్‌ట్రాక్‌లు, ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేశారన్నారు. ఇరుకు రోడ్లను విశాలమైన రోడ్లుగా, మురుగు నీరు చెరువుల్లోకి పోకుండా ప్రత్యేక ట్రంక్‌లైన్ ఏర్పాటు చేశారన్నారు. అభివృద్ధి చేశారు కనుకనే మరోసారి మహేశ్వరంలో గులాబీ జెండాను ఎగురవేయడం ఖాయమని కాలనీల అసోసియేషన్ అధ్యక్షులు ధీమా వ్యక్తం చేశారు. చేసిన అభివృద్ధి ఎక్కడ చూసినా కన్పిస్తున్నది కనుకనే అన్ని కాలనీల అసోసియేషన్ అధ్యక్షులం ఏకగ్రీవ తీర్మానాలు చేశామని చెబుతున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా పనిచేసే మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని కాలనీల అసోసియేషన్ నాయకులు పేర్కొంటున్నారు. మహిళలు, సీనియర్ సిటిజన్లు, యువత, సంక్షేమ సంఘాల నాయకులు సైతం కారు సర్కారు కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నారని కాలనీ వాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, సీనియర్ సిటిజన్లు, యువత, సంక్షేమ సంఘాల నాయకులు సైతం కారు సర్కారు కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నారని కాలనీ వాసులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించిన ఘనత మంత్రిదేనన్నారు. మహేశ్వరంలో మరోసారి గులాబీ జెండాను ఎగురవేస్తామని కాలనీవాసులు శపథం చేస్తున్నారు.

# 1672 కోట్లతో అభివృద్ధి చేశాం

- ప్రజలు ప్రతిపక్షాల మాటలకు మోసపోకండి
- తాండూరులో రూ.1648.12 కోట్లతో ప్రజా సంక్షేమం
- మళ్లీ గెలిపించండి.. అందరూ గర్వపడేలా పనిచేస్తా
- మీడియా సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, అక్టోబర్ 14 : బీఆర్ఎస్ సర్కారు హయాంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కడితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తాండూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినట్లు తెలిపారు. తాండూరు పట్టణ అభివృద్ధి పనులకు రూ.1191.86 కోట్లు, తాండూరు మండలంలో అభివృద్ధికి రూ.236.14 కోట్లు, యాలాల మండలంలో అభివృద్ధికి రూ. 97.77 కోట్లు, బషీరాబాద్ మండలంలో అభివృద్ధికి రూ.68.18 కోట్లు, పెద్దేముల్ మండలం, కోట్ పల్లి పరిధిలోని పలు గ్రామాల అభివృద్ధికి రూ.78.54 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మళ్లీ గెలిపించండి.. అందరూ గర్వపడేలా పని చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీ నేతల అసత్య మాటలను ప్రజలు నమ్మరాదని సూచించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం తాండూరు అన్ని విధాల అభివృద్ధి చెందేందుకు వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఒకప్పుడు వానకాలం వచ్చిందంటే పల్లెలు రోగాలతో వణికిపోయేవని, మిషన్ భగీరథ, పల్లెప్రగతి తదితర కార్యక్రమాలతో ఆ పరిస్థితి నేడు లేదన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని వార్డులు పరిశుభ్రంగా మారడంతో సీజనల్ వ్యాధులు తగ్గాయని తెలిపారు. ప్రతి ఊరిలో చెత్త సేకరణ ట్రాక్టర్, డంప్‌యార్డ్, నర్సరీలు, వైకుంఠ ధామాలను నిర్వహిస్తూ పరిశుభ్రతను కాపాడుకుంటున్నామన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీగా మార్చామన్నారు. వారంటీ లేని గ్యారంటీలు కాంగ్రెస్ పార్టీవని ఎద్దేవా చేశారు. ఆరు దశాబ్దాలు పాలించినా ఏమీ చేయకుండా మళ్లీ ఆరు గ్యారంటీలా..? ఓటుకు నోటు కేసులో దొరికి ఎమ్మెల్యే సీట్లు అమ్ముకునే వారి మాటలు ప్రజలు నమ్మి మోసపోరాదని సూచించారు. రూ.100 కోట్లకు బీజేపీ నన్ను కొనాలని చూసినా తాండూరు బిడ్డగా అమ్ముడుపోలేదన్నారు. తాండూరు ప్రజలకు సేవకునిగా మరణించేంత వరకు పని చేస్తానన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతోపాటు డబుల్ బెడ్‌రూంలను ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీశైల్‌రెడ్డి, కరుణం పురుషోత్తంరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, బీఆర్ఎస్ బషీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పెద్దేముల్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, యాలాల మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు శోభారాణి, నీరజ, సంగీత ఠాకూర్, బీఆర్ఎస్ నేతలు నారాయణరెడ్డి, శ్రీనివాస్ చారి, నర్సింహులు, సిద్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలపై ప్రత్యేక నిఘా

- జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టుల ఏర్పాటుకు చర్యలు
- డబ్బు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట
- పర్యవేక్షించిన జిల్లా జాయింట్ కలెక్టర్ లింగ్యానాయక్


చంద్రకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను పర్యవేక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ లింగ్యానాయక్

దౌల్తాబాద్ : శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రతి పంచాయతీ ఎన్నికల్లో మద్యం, డబ్బు అక్రమ రవాణా అడ్డుకట్ట వేశారు. అలాగే జిల్లా సరిహద్దుల్లోని చంద్రకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ లింగ్యానాయక్ శనివారం పర్యవేక్షించారు. చెక్‌పోస్ట్‌ల ఏర్పాటుతో పోలీసు నిఘాను మరింత కట్టుదిట్టం చేసి ఈసారి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిగి డీఎస్పీ, కొడంగల్ సీఐ, ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

**వాహనాల తనిఖీ ముమ్మరం**

సాధారణ ఎన్నికల్లో సర్వైలెన్స్ స్టాటిస్టికల్ టీం(ఎస్ఎస్‌టీ), ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. మండలం సరిహద్దులోని దేవర్‌ఫస్లవాద్, చంద్రకల్ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాట్లు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ టీమ్‌లు పక్క రాష్ట్రం నుంచి మద్యం, డబ్బు రాకుండా అరికడతాయి. ఇటీవల జరిగిన సాధరణ ఎన్నికల్లో సైతం సత్ఫలితాలు రాగా, రాష్ట్ర ఎన్నికల సంఘం శాసనసభ ఎన్నికల్లో ప్రస్తుతం ఎస్ఎస్‌టీంలు విధుల్లో కొనసాగుతూ వాహనాల తనిఖీలను ముమ్మరం చేస్తున్నాయి.

# సరిహద్దుల్లో పటిష్ట నాకా బందీ

కొడంగల్, అక్టోబర్ 14 : ఎన్నికల నేపథ్యంలో బార్డర్ ప్రాంతాల్లోని చెక్ పోస్టుల్లో సిబ్బంది పటిష్టమైన నాకా బందీ నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, పరిడి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి తెలిపారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని కస్తూర్‌పల్లి, చంద్రకల్ గ్రామాల తెలంగాణ–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును వారు సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. కర్ణాటక బార్డర్ కావడం వల్ల సిబ్బంది చాలా చురుకుగా ఉండి ప్రతి వాహనాన్ని చెక్ చేయడంతోపాటు అనుమానం ఉన్న వ్యక్తులను క్షణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సజావుగా ఎన్నికలు జరిగేల చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు.

# శాస్త్రవేత్తల పొలం బాట


ఆదర్శ రైతు నాగరత్నం నాయుడు పొలంలో శాస్త్రవేత్తలు

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 14: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సద్దుపల్లిలో ఉన్న ఆదర్శ రైతు గుడివాడ నాగరత్నం నాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని యువ శాస్త్రవేత్తలు శనివారం సందర్శించారు. జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 75 మంది యువ శాస్త్రవేత్తలు తరలివచ్చారు. వ్యవసాయ క్షేత్రంలో పండిస్తున్న పంటల గురించి ఆసక్తిగా నాగరత్నం నాయుడును అడిగి తెలుసుకున్నారు. అగ్రికల్చరల్, హార్టికల్చర్, ఫ్లోరికల్చర్, డెయిరీ, ఔషధ మొక్కలు ఇలా అనేక రకాలు ఒకేచోట పండిస్తుండటం గొప్ప విషయమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారదావెంకటేశ్
- జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తున్న గురుకుల విద్యార్థులు

మొయినాబాద్, అక్టోబర్ 14 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు క్రీడాకారులుగా పురోగతి చెంది జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణిస్తున్నారని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారదావెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల ఆవరణలో ఈ నెల 16వ తేదీ వరకు జరగనున్న 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 11 గురుకుల బాలుర పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చేందుకు హోరాహోరీగా తలపడుతున్నారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు నువ్వానేనా అన్నట్లుగా తలపడటంతో క్రీడలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. క్రీడా పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారదావెంకటేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యతో పాటు వివిధ క్రీడా విభాగాల్లో తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడా రంగంలో రాణిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలతోపాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణిస్తూ గురుకుల విద్యా సంస్థను ఉన్నత స్థానంలో నిలబెడుతున్నందుకు చాలా గర్విస్తున్నామని చెప్పారు. నాలుగు రోజుల పాటు జరగనున్న క్రీడా పోటీల్లో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొనడానికి ముందుకొచ్చారన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఇంటర్ గురుకులాల పోటీల్లో పాల్గొంటారని, అక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని చెప్పారు. క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకున్న క్రీడాకారులు భవిష్యత్తులో గెలుపును సొంతం చేసుకోగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌శంకర్, ప్రాంతీయ క్రీడాధికారి ఉదయ్‌భాస్కర్, ఫిజికల్ డైరెక్టర్‌లు ఆదిబాబు, చందర్‌నాయక్, పీఈటీలు, వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిలుకూరు గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ ఆడుతున్న విద్యార్థులు

# కలాంకు..సలాం..

## ఆవగింజలతో అబ్దుల్ కలాం చిత్రం


ఆవగింజలతో అబ్దుల్ కలాం చిత్రాన్ని వేస్తున్న చిత్ర కళాకారుడు సున్నపు అశోక్

కొడంగల్, అక్టోబర్ 14 : అబ్దుల్ కలాం 92వ జయంతిని పురస్కరించుకొని ఆవగింజలతో కలాం చిత్రాన్ని చిత్రీకరించి కళాకారుడు నివాళి అర్పించాడు. దౌల్తాబాద్ మండలంలోని యాంగి గ్రామానికి చెందిన సున్నపు అశోక్ ఆయా సందర్భాలను అనుసరించి ఎన్నో అబ్బురపరిచే చిత్రాలను చిత్రీకరించి పలువురి మన్ననలను పొందుతున్నాడు.

పేదరికంతో తన ప్రతిభను నిరూపించుకునే అవకాశాల కోసం ఎదురు చూస్తూ.. తాను చిత్రీకరిస్తున్న బొమ్మలను పలువురికి చూపిస్తూ.. ప్రశంసలు పొందుతున్నాడు. దానిలో భాగంగానే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన భారతావనికి చేసిన సేవలను గుర్తు చేస్తూ.. ఆవ గింజలతో అపురూపమైన కలాం చిత్రాన్ని చిత్రీకరించాడు. పేదరికాన్ని జయించి, సాంకేతిక శాస్త్ర రంగంలో భారత దేవ గొప్పదనాన్ని చాటిన వ్యక్తిని ఈ సందర్భంగా స్మరించుకొని నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు.